జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com






# పేదోడి స్థలంపై.. గోవిందుడి కన్ను!



- అధికార బలంతో ఆక్రమణ
- దీని వెనుక బల్లగ నాయకుడి అండదండలు
- దివ్యాంగుడి స్థలంలో దౌర్జన్యంగా పార్కింగ్
- 3 సెంట్లు ఇస్తేనే కారు తీస్తానంటూ బెదిరింపులు
- ఎమ్మెల్యే మా వెనుక అంటూ బీరాలు
- కలెక్టర్, ఎస్పీకి గతంలో ఫిర్యాదు చేసిన బాధితుడు
- బాధితుడికి న్యాయం చేయాలంటూ రౌడీయిజంపై ఏకమవుతున్న పౌర సమాజం





To,

The District Collector & District Magistrate,

District Collectorate,

Srikakulam District, Andhra Pradesh.

Date:-24/08/2026

**Subject:** Representation under the Maintenance and Welfare of Parents and Senior Citizens Act for urgent protection of property, removal of illegal vehicle trespass, and action against harassment by Alapana Govinda Rao.

Respected Sir,

I, **Kaspa Appana Patnaik**, S/o Late Kameswara Rao, aged 70 years (Senior Citizen), residing at D.No. 10-8-19, Kaspa Veedhi, Srikakulam Town, Srikakulam District, am a Senior Citizen suffering from paralysis and severe physical disability. I reside with my single, unmarried daughter. And I am filing this complaint on behalf of Kaspa Venkata Lakshmi my brother's wife who is co owner of the property.

I am the absolute and lawful owner in peaceful possession of the landed property situated at **Dandi Veedi**, Srikakulam in RS no 248-2 & TS 377-2B

I submit that the Hon'ble High Court of Andhra Pradesh has granted a **Stay Order in W.P. No. 33949/2025** in respect of the subject property, confirming and protecting my lawful possession and interest in the land.

I submit that One **Alapana Govinda** Rao, who has absolutely no right, title, or interest over my property, has been continuously harassing me and attempting to illegally encroach upon my land. Taking advantage of my health condition and advanced age, he has illegally parked his commercial vehicle—a **White** Maruti **Brezza with Yellow Number Board, Registration No. AP 39 UU** 0013—directly inside my property without my consent and refuses to remove it.

**I submit that** Whenever I attempt to sell my property to meet my living and medical expenses, Mr. Alapana Govinda Rao spreads false rumors among prospective buyers claiming the land is under dispute, thereby destroying my financial stability and lawful rights.

COLLECTOR'S OFFICE 24 AUG 2026 SRIKAKULAM

శ్రీకాకుళం, ఆగస్టు 30 (వార్త): పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్న ఒక వృద్ధుడికి చెందిన విలువైన స్థలాన్ని ఎలాగైనా ఆక్రమించాలనే దుర్బుద్ధితో అలపాన గోవిందరావు (అలియాస్ గోవిందరెడ్డి) అనే వ్యక్తి సాగిస్తున్న అరాచకాలు నగరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే పలు సెటిల్మెంట్లలో తల దూర్చుతూ పోలీసులకు తలనొప్పి తెస్తున్న ఫాజల్‌బాగ్ పేటకు చెందిన అతడు శ్రీకాకుళం నగరం దండి వీధిలోని రెవిన్యూ సర్వే నెం. 248-2, టౌన్ సర్వే 377-2బి నంబర్లలోని కోట్ల రూపాయల విలువైన స్థలంపై కన్ను వేశాడు. కస్పా అప్పన పట్నాయక్ (70), వారి సోదరుడు రాధాకృష్ణమూర్తిలకు చెందిన స్థలం అది. దీనిపై ఓ వీఆర్వో కబ్జా చేసేందుకు దొంగ రికార్డులు సృష్టించగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డబ్ల్యూపీ నెం. 33949/2025 ద్వారా అనుకూలంగా స్పష్టమైన 'స్టే' ఉత్తర్వులు ఇచ్చింది. అయినప్పటికీ, సదరు 70 సెంట్ల స్థలంతో ఎలాంటి సంబంధం గానీ, హక్కులు గానీ లేని గోవిందరావు.. ఫాజుల్ భాగుపేట నుంచి వచ్చి దండి వీధిలో కొందరు అల్లరి మూకలతో కలిసి తనకున్న బలంతో వృద్ధుడి ఆస్తిపై కన్నేసి నిరంతరం వేధింపులకు గురిచేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు.

## నాయకుడి ప్రోత్సాహం... 3 సెంట్లు రాబట్టే కుట్ర..

గోవిందరావు సాగిస్తున్న ఈ దౌర్జన్యాల వెనుక మార్కెట్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న బల్లగ ప్రాంతానికి చెందిన ఒక నాయకుడి అండదండలు ఉన్నట్లు స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదాన్ని మరింత పెంచి, స్థలంలో వ్యవహారం నడిపిస్తే కొంత సొమ్ము నొక్కుకోవచ్చనే దురాశతో సదరు నాయకుడు ఇలాంటి రౌడీయిజం చేస్తున్న వ్యక్తులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే గోవిందరావు మరింత తెగబడి "నాకు మూడు సెంట్లు స్థలం రాసిస్తే కారు పక్కన పెడతా, లేదంటే ఇక్కడే పార్క్ చేస్తా" అంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగడంపై వీధివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో ఉన్న వ్యక్తి వచ్చి ఇక్కడి ఖాళీ స్థలంలో కారు పార్క్ చేయడం వెనుక ఉన్న దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేకు ఈ విషయం తెలియకపోయినా ఎమ్మెల్యే మా వెనక ఉన్నాడంటూ బీరాలు పలుకుతూ వీరు నేరుగా స్థలంలోకి వెళ్లి వృద్ధులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తమతో రాజీకి వచ్చి సగం డబ్బులు ఇస్తే తప్ప దీన్ని మార్కెట్లో అమ్మకుండా చేస్తామంటున్నారు. దీనిపై ఆ దంపతులు జిల్లా ఎస్పీని, కలెక్టర్‌ను ఆశ్రయించారు.

## పౌర సమాజం ఉద్యమించే అవకాశం..

పక్షవాతంతో బాధపడుతున్న పట్నాయక్ తన జీవనోపాధి, నిత్య వైద్య ఖర్చుల కోసం స్థలాన్ని విక్రయించుకోవాలని చూస్తుంటే, కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ గోవిందరావు ఆస్తిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. గతంలో శ్రీకాకుళంలో ఇలాంటి రౌడీయిజం పెచ్చుమీరినప్పుడు పౌర సమాజం ఏకతాటిపైకి వచ్చి బుద్ధి చెప్పిన ఘటనలు ఉన్నాయి. ఏకంగా నగర బంద్ కి కూడా పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నియోజకవర్గ రాజకీయాలు కూడా తలకిందులు కావడానికి రౌడీయిజమే కారణం. ఇప్పుడు గోవిందరావు లాంటి వ్యక్తుల అరాచకాలను అరికట్టకపోతే నగరంలో మరోసారి ప్రజా ఉద్యమం రాక తప్పదనే హెచ్చరికలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని దివ్యాంగుడికి న్యాయం చేయాలని, బాధితుడికి రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి..
# రూ.4.52 కోట్లు



* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుల కృషికి దక్కిన ఫలితం * ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్



**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఆగస్టు 30 (వార్త):** కొత్తమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు రూ.4.52 కోట్లు నిధులు మంజూరయ్యాయి. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అలాగే కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుల ప్రత్యేక కృషి ఫలితంగానే దేవాదాయ శాఖ నుంచి నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే కొత్తమ్మ తల్లి ఉత్సవాలను రాష్ట్రస్థాయి పండుగలా చేయడంలో వీరి కృషి మరవలేనిది. కొత్తమ్మ అమ్మవారి దేవాలయ ప్రాకార మండపం నిర్మాణం, ఇతర మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.5కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా స్థానిక మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ కింద రూ.48 లక్షలు డిపాజిట్ చేయగా, దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కమిటీ మిగిలిన రూ.4,52,00,000 లను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్రమోహన్ అమరావతి నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. మంజూరైన అంచనా వివరాలకు సాంకేతిక అనుమతులు పొంది, ఈ-టెండర్ల విధానంలో పారదర్శకంగా పనులు ప్రారంభించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాకార మండప నిర్మాణం పూర్తయితే భక్తులకు మౌలిక వసతులు మెరుగవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

* పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష
* రూ.2.23 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

**పలాస, ఆగస్టు 30 (వార్త):** ముఖ్యమంత్రి సహాయం నిధి (సీఎంఆర్‌ఎఫ్) పేద ప్రజలకు వరమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని తెలిపారు. పలాసలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దేవునల్తాడ గ్రామానికి చెందిన సోడిపిల్లి లక్ష్మి కుటుంబానికి రూ.81 వేల, ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చింత వెంకటేష్ కుటుంబానికి రూ.1.42 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. మొత్తం రూ.2.23 లక్షల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ అనారోగ్యం, వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ గోవిందు పాపారావు, టీడీపీ నాయకులు తులే అప్పోజీ, చింత నారాయణ పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలకు రూ.10వేలు విరాళం



**పలాస, ఆగస్టు 30 (వార్త):** శివాజీనగర్‌లో వచ్చేనెల 14న నిర్వహించనున్న వినాయక చవితి వేడుకలకు ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీధర్‌బాబా మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు పలాస నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంతో పండుగను భక్తిభావంతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. పలాస నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా దువ్వాడ లీలావతి 80వ జన్మదిన వేడుకలు



**పలాస, ఆగస్టు 30 (వార్త):** స్వర్గీయ దువ్వాడ కృష్ణమూర్తి సతీమణి దువ్వాడ లీలావతి 80వ జన్మదిన వేడుకలు ఆదివారం పలాసలోని ఆమె స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో వేడుకలు ఆత్మీయంగా సాగాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి లీలావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రముఖులు, మహిళలు పాల్గొని లీలావతికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న చిన్నారుల లఘు నాటిక



**జలుమూరు, ఆగస్టు 30 (వార్త):** జలుమూరు మండలం హరికృష్ణంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మాతృ దినోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన లఘునాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు ఆదివారం వివరాలు తెలియజేస్తూ, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి తోడ్పడేలా పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన 'చిన్ని రామకృష్ణుడి సమయస్ఫూర్తి' అనే లఘునాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. చిన్నారులు పాత్రలకు అనుగుణంగా ప్రదర్శించిన హావభావాలు, సంభాషణలు స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశాయని పేర్కొన్నారు. ఎంతో సహజంగా నటిస్తూ తమలోని ప్రతిభను ప్రదర్శించిన చిన్నారులను పలువురు అభినందించారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో సృజనాత్మకత, నటనాభిరుచి, సమయస్ఫూర్తి వంటి లక్షణాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు భవిష్యత్తులో మరింత రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రదర్శనను అభినందించిన మండల విద్యాశాఖాధికారి మద్దు వెంకటరమణ, చిన్నారులు ఇదే ఉత్సాహంతో విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## నేడు వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం

**శ్రీకాకుళం, ఆగస్టు 30 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్లో సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి కేడర్ అంతా తరలిరావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తమ రావు పిలుపు నిచ్చారు. ప్రారంభోత్సవానికి ముందు సాయంత్రం మూడుగంటలకు వై. యస్. ఆర్ విగ్రహం 7 రోడ్ల జంక్షన్ నుండి టౌన్ హాల్ లోని నూతన పార్టీ కార్యాలయానికి ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన కేడర్ అంతా వై.యస్.ఆర్ విగ్రహం 7 రోడ్ల జంక్షన్ వద్దకు చేరుకోవాలని కోరారు. రద్దీ దృష్ట్యా టౌన్ హాల్ లోకి వాహనాలను అనుమతి ఉండదన్నారు.

# నీట్ పీజీ పరీక్షలకు 97.85 శాతం హాజరు



**శ్రీకాకుళం, ఆగస్టు 30(వార్త):** జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ-2026 (మోడరన్ మెడిసిన్) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 697 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 682 మంది హాజరయ్యారు. 15మంది గైర్హాజరు కావడంతో జిల్లాలో మొత్తం 97.85 శాతం హాజరు నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పరీక్షా కేంద్రాల వారీగా వివరాలు పరిశీలిస్తే... చిలకపాలెంలోని శ్రీ శివాని ఇంజనీరింగ్ కాలేజీ సెంటర్‌లో 270 మందికి గానూ 266 మంది (98.52%), ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 100 మందికి 97 మంది (97%), నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో 312 మందికి 305 మంది (97.76%), అలాగే టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఆదిత్య కళాశాల)లో 15 మందికి 14 మంది (93.33%) అభ్యర్థులు హాజరయ్యారు. శ్రీకాకుళం డివిజన్‌కి సంబంధించి ఆర్డీవో సాయి ప్రత్యూష పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

### పోలీసు భద్రత నడుమ..



నీట్ పీజీ 2026 పరీక్ష జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. అభ్యర్థులు రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు డ్రోన్ సర్వైలెన్స్‌ను వినియోగించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ పరీక్ష సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

### నరసన్నపేటలో ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్షలు



**నరసన్నపేట, ఆగస్టు 30 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఆదివారం నీట్ పీజీ--2026 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో అభ్యర్థులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు 108 అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులో ఉంచారు. పరీక్షల సందర్భంగా అభ్యర్థుల సౌకర్యార్థం అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సుమారు 300 మంది అభ్యర్థులు నీట్ పీజీ--2026 పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్, ఆర్డీఓ సాయి ప్రత్యూష ఆకస్మికంగా పరిశీలించారు. ఆదివారం ఉదయం కేంద్రానికి చేరుకున్న ఆమె పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు.





# సామాజిక అంశాలే రచయితకు అస్త్రాలు కావాలి

* 'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి'
పుస్తక పరిచయ సభలో వక్తల పిలుపు



**మందస, ఆగస్టు 30(వార్త):** సామాజిక అంశాలే రచయితలు అస్త్రాలుగా సంధించాలని వక్తలు పిలుపునిచ్చారు. మందస మండలంలోని హరిపురం జంక్షన్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాసిన 'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి' వ్యాస సంపుటి పుస్తక పరిచయ సభ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పౌర హక్కుల సంఘం బాధ్యుడు యు.సోమనాథం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, రచయిత, అరసం గౌరవ అధ్యక్షుడు చింతాడ కృష్ణారావు మాట్లాడుతూ ఈ పుస్తకంలో ప్రతీ వ్యాసం నేటి విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఎంతగానో ప్రయోజనకారిగా ఉంటుందనడంలో సందేహం లేదన్నారు. గ్రంథాలయాల్లో, స్కూళ్లల్లో ఈ పుస్తకం ఉండాలని, నేటి తరం ఈ వ్యాసాలు ఆకళింపు చేసుకోవాలని సూచించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి దానేష్ మాట్లాడుతూ ఈ దేశంలో జరుగుతున్న పరిణామాలకు ప్రతిబింబం ఈ పుస్తకమని అభివర్ణించారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో ముందుకు సాగాలని అభిలషించారు. రచయిత మామిడి కోదండరావు మాట్లాడుతూ ఈ తరహా వ్యాసాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని సూచించారు. పుస్తక రచయిత పేడాడ కృష్ణా రావు మాట్లాడుతూ సమాజంలో అసమతుల్యతలపై ఈ వ్యాసాలు రాసానని, వీటిని అవగాహన చేసుకొని ఉద్యమాలతో ముందుకు సాగాలని సూచించారు. ఉత్తరంధ్రాలో ప్రధాన సమస్యలు గుర్తించి ఐక్య పోరాటాలకు ఉపక్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్గో వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కొమర వాసు, రైతు సంఘం నాయకుడు మామిడి మాధవరావు, వంశధార జల సాధన సమితి నాయకులు మార్పు మన్మధరావు, సాలిన వీరాస్వామి, పుచ్చదుర్యోధన, గంగయ్య, సాలిన ఈశ్వరరావు, మామిడి గణపతి, నల్ల హడ్డి, సోమనాథం, దాసరి తాతారావు, కొర్ల విశ్వనాథం, కొర్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# సరస్వతిదేవి ప్రతిరూపమే లక్ష్మి

*** కృషి, పట్టుదల, అంకితభావానికి లఖినాన నిదర్శనం * గురుకులాన్ని గాడిలో పెట్టిన ప్రిన్సిపల్ లక్ష్మి * గురుకులం ప్రిన్సిపల్ లక్ష్మి ఉద్యోగ విరమణ**




**మందస, ఆగస్టు 30(వార్త):** ఓ విద్యాసంస్థను సమస్యల్లేకుండా నడిపించడమంటే కృషి, పట్టుదల, అంకితభావం ఉండాలని, చదువుల తల్లిగా గుర్తింపు పొందిన లక్ష్మికే సాధ్యపడిందని శ్రీకాకుళం జిల్లా గురుకులాల సమన్వయాధికారిణి వై. యశోదలక్ష్మి అన్నారు. మందస మండలంలో భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం(బాలికలు) ప్రిన్సిపల్ లఖినాన లక్ష్మి ఉద్యోగ విరమణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేరు మాత్రం లక్ష్మి అని, కానీ.. ఉద్యోగంలో మాత్రం సరస్వతీలా సేవలందించారని కొనియాడారు. నాలుగేళ్ల పాటు మందసలో ప్రిన్సిపల్ గా పని చేసిన లక్ష్మి ఎక్కడా ఎటువంటి సమస్యల్లేకుండా, విద్యార్థినిలను సొంత బిడ్డల్లా చూసుకున్నారన్నారు. అనారోగ్యరీత్యా ప్రిన్సిపల్ ముందే ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. ఆమె సర్వీసు యావత్తూ వినియోగపడి ఉంటే.. గురుకులాల అభివృద్ధికి దోహదపడి ఉండేదన్నారు. వివాదరహితురాలిగా, ఉత్తమ అధికారిణిగా ఆమె సేవలు చిరస్మరణీయమన్నారు. ఇంకొంత కాలం ప్రిన్సిపల్ గా లక్ష్మి సేవలు కొనసాగి ఉండాల్సిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 33ఏళ్లపాటు పని చేసిన ఆమె మంచి ప్రిన్సిపల్ గా లక్ష్మి గుర్తింపు పొందారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లఖినాన లక్ష్మి, బమ్మిడి భీమారావు దంపతులను ఘనంగా సన్మానించారు. దుశ్శాలువతో సన్మానించి, బొకేలను అందజేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సరస్వతీదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ప్రిన్సిపల్ లక్ష్మి మాట్లాడుతూ తన సేవలను గుర్తించినందుకు ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేవలం అనారోగ్యం దృష్ట్యా తాను రిటైర్ మెంట్ తీసుకున్నానన్నారు. ఉద్యోగంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డీసీఓ యశోదలక్ష్మితో పాటు రవికుమార్, మేథ్ మెటిక్ ఫోరం తరుపున టి.రామ్మూర్తి(కొల్లివలస), విజయనగరం జిల్లాకు చెందిన కె.సన్యాసమ్మ దంపతులు, ఎస్.రవి, వైస్ ప్రిన్సిపల్ పైల గణపతిరావు, జి.విజయలక్ష్మి, వై.త్రివేణి, బి. బేబికుమారి, ఎస్. వరలక్ష్మి, కె.నాగావళి, జి.రూపావతి, బి.సునీత, కె.శోభారాణి, బి.పార్వతి, కె. భారతిసాయి, టి.పద్మావతి, పి.శ్యామలాగౌరి, పి.రజని, బి.చరిత, బి.శ్రీదేవి, సిబ్బంది ఎం.పుష్పలత, ఎన్.లక్ష్మి, శ్రీలక్ష్మి, టి.మమ్మీదేవి, భవాని పాల్గొన్నారు.



## క్రైం వార్తలు

## ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, క్యాబ్

### ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలు




**పలాస, ఆగస్టు30 (వార్త):** పలాస మండలం గరుడఖండి పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆర్టీసీ బస్సు, క్యాబ్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఐదుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. పరీక్ష రాసేందుకు విశాఖపట్నం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మెళియాపుట్టికి చెందిన ఆరుగురు అభ్యర్థులు క్యాబ్‌లో విశాఖపట్నం బయలుదేరారు. ఇదే సమయంలో విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గరుడఖండి సమీపంలో ఎదురుగా వస్తున్న క్యాబ్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి క్యాబ్ తీవ్రంగా దెబ్బతినడంతో అందులోని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గోపాల్, శ్యామ్‌సుందర్, రాజు, చక్రవర్తి, సాయి కల్యాణ్‌గా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్యాబ్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీసి 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గాయాల తీవ్రత దృష్ట్యా వైద్యుల సూచన మేరకు శ్రీకాకుళం తరలించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యమా.. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి అసలు కారణం పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## గాయపడిన ఉపాధ్యాయులకు పరామర్శ



గరుడఖండి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డీఎస్సీ-2025 ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పరామర్శించారు. మెళియాపుట్టి మండలానికి చెందిన పెద్దమడి, భరణికోట ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాద సమాచారం తెలుసుకున్న మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల విద్యాశాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్.వెంకటాచలం, జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ తదితరులు ఉపాధ్యాయులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ఉపాధ్యాయ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. డీఎస్సీ-2025 ఆత్మగౌరవ ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమైంది. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా చూడాలని పలువురు కోరారు.

## రైలు నుంచి జారిపడి మహిళకు గాయాలు



**పలాస, ఆగస్టు 30 (వార్త):** పలాస రైల్వే స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. అస్సాం రాష్ట్రానికి చెందిన అజ్మినా ఖాన్ కలకత్తా నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న పలాస 108 సిబ్బంది సత్యం, వెంకటరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. పలాస జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హుండిలో చోరీ



**పలాస, ఆగస్టు 30 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం హుండిలోని సాగర్ కాలనీలో ఆదివారం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు పై అంతస్తులోకి ప్రవేశించి సూట్ కేసులో భద్రపరిచిన మూడు తులాల బంగారం, రూ.15 వేల నగదును అపహరించినట్లు సమాచారం. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను పరిశీలించారు. కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని, రూరల్ సీఐ తిరుపతిరావు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ సాగిస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సన్నద్ధం




**మందస, ఆగస్టు 30(వార్త):** స్థానిక సంస్థల ఎన్నికలను ఏజెండాగా చేసుకుని మందస జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు అధ్యక్షతన పంచాయతీ ఇన్‌చార్జిలతో సుమారు నాలుగు గంటల పాటు కూలంకషంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహుల అభిప్రాయాలను నాయకులు తెలుసుకున్నారు. కూటమి పార్టీలతో సమన్వయంతో ముందుకు సాగుతూ విజయమే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరంపై చర్చించారు.మండలంలోని ప్రతి పంచాయతీలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీ చేయడానికి జనసేన శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని నాయకులు సూచించారు. కూటమి పెద్దల నిర్ణయం మేరకు జనసేనకు కేటాయించే స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించి విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు.అలాగే సమీపంలో ఉన్న పార్టీ అధ్యక్షుల పుట్టినరోజు వేడుకలను ప్రతి పంచాయతీలో ఘనంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు.ఈ సమావేశంలో నియోజకవర్గం పి ఓ సి వి.దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షులు పందిరి నీలయ్య, సవర శివ, రాపాక కేశవ్, పిఎసిఎస్ డైరెక్టర్ పి. వాసు, ఏఎంసి డైరెక్టర్ బి. భాస్కర్, మండల కార్యదర్శులు బొంగు మురళీ, కొడ చండీరావు, తెలుకుల సందీప్, రౌతు చిరంజీవి, బమ్మిడి మహేష్, సోషల్ మీడియా వింగ్ తిరుపతి గౌడతో పాటు వివిధ పంచాయతీల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విధులకు అదనపు గౌరవ వేతనం ఇవ్వాలి

### ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ల వినతి



**పలాస, ఆగస్టు 30 (వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో విధులు నిర్వర్తిస్తున్న ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లకు అదనపు గౌరవ వేతనం చెల్లించాలని అదనపు రాష్ట్ర ఎన్నికల అధికారి డిల్లీరావును కోరారు. ఈ మేరకు జిల్లాలోని ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు ఆదివారం డిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి, తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఎస్ఐఆర్ విధుల్లో భాగంగా కంప్యూటర్ ఆపరేటర్లపై పని భారం గణనీయంగా పెరిగిందని వారు తెలిపారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, అదనపు పనిభారం, ఇతర కార్యనిర్వహణ ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిరంతరం సేవలందిస్తున్న నేపథ్యంలో అదనపు గౌరవ వేతనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలపై డిల్లీరావు సానుకూలంగా స్పందించినట్లు కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు రాజేష్, సిమ్మన్న, హరి, కోదండ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

**శ్రీకాకుళం, ఆగస్టు 30 (వార్త):** శ్రీకాకుళం సమీప రాగోలులోని జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నూతన నైపుణ్య కోర్సులు రెండు నెలలు పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు చైల్డ్ కేర్ టేకర్, కేర్ గివర్, ఎల్డర్లీ కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇందుకు 18 నుంచి 30 ఏళ్ల లోపు గల యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేసి, ఆయా రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9121999654 సెల్ నంబర్లను లేదా తమ సంస్థ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

## మాజీ మంత్రి ధర్మానపై అక్రమ కేసు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 30 (వార్త):** హుదూద్ ఇళ్ళ గృహప్రవేశంపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు తీవ్ర అక్షేపనీయమని, ఇది ప్రజాస్వామ్యంపై కూటమి ప్రభుత్వం దాడి అని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ కార్యాలయం లో రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, డీసీఎంస్ మాజీ చైర్ పర్సన్ ప్రతినిధి సల్ల దేవరాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల క్రితం కుందువానిపేటలో జరిగిన సాంప్రదాయక గృహప్రవేశం కూడా నేరంగా చూపిస్తూ వైస్సార్సీపీ నేతలపై క్రిమినల్ కేసులను నమోదు చేసి వైస్సార్సీపీ నాయకులను భయపెట్టాలని చూడడం బ్రిటిష్ పరిపాలనను తలపిస్తుందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు గడచినా ఒక్క కొత్త ఇల్లు కట్టించలేని చేతకాని ప్రభుత్వమన్నారు. వైస్సార్సీపీ 5 ఏళ్ళ కాలంలో 31 లక్షల ఇళ్ళు మంజూరు చేసి 20 లక్షల ఇళ్ళు కట్టించిందనే దుగ్దతో వైస్సార్సీపీ పెద్దలను అవమానించి తమ శాడిజాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైస్సార్సీపీ యువ ప్రతినిధులు సాడి జయరాం రెడ్డి, జుత్తు బేసింగి యాదవ్ పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ గర్జన ర్యాలీకి డీఎస్సీ ఉపాధ్యాయుల పయనం



**నరసన్నపేట, ఆగస్టు 30(వార్త):** 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆత్మగౌరవ గర్జన ర్యాలీలో పాల్గొనేందుకు ఆదివారం నరసన్నపేట నుంచి బయలుదేరారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశమై అనంతరం విశాఖపట్నానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిని సాధించాలనే లక్ష్యంతో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి, రాత్రింబవళ్లు శ్రమించి డీఎస్సీలో విజయం సాధించామని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగం అనేది తమ కల అని, అందుకోసం దీర్ఘకాలంగా సన్నద్ధమై పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఎంపికయ్యామని పేర్కొన్నారు. అయితే డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు తమను తీవ్రంగా బాధిస్తున్నాయని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సాధించిన ఉద్యోగాలపై అనవసర ఆరోపణలు చేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల మనోభావాలను తెలియజేసేందుకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ గర్జన ర్యాలీకి భారీ సంఖ్యలో హాజరవుతున్నామని తెలిపారు. ర్యాలీని విజయవంతం చేయడంతో పాటు తమ అభిప్రాయాలను తెలియజేస్తామని పేర్కొన్నారు.

## తెలుగు కవితా పోటీల్లో 'మార్పు' ప్రతిభ

*** కళావేదిక అవార్డు పొందిన 'జగన్మోహనరావు'**

*** వెల్లువెత్తిన అభినందనలు**

**మందస, ఆగస్టు30(వార్త):** శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కవితా పోటీల ఫలితాలు విడుదలయ్యాయి. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 173జాతీయ స్థాయి కవిసమ్మేళనాలు, అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన సంగతి విదితమే. శ్రీశ్రీ కళావేదిక సరికొత్తగా 24 గంటల్లో కవితా పోటీని నిర్వహిస్తూ కొత్త అధ్యాయానికి తెర తీసింది. నూతనంగా నిర్వహించిన ఈ చిత్ర కవితా పోటీకి విశేషమైన స్పందన లభించింది. ఇందులో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ తమ సృజనాత్మకత, భావవ్యక్తీకరణ, భాషా సౌందర్యంతో ఆకట్టుకున్నారు. చిత్రంలోని భావం, భాషా శైలి, సృజనాత్మకత, అక్షరదోష రహిత రచన వంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని... నిష్పక్షపాతంగా న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేతలు ఎంతో ఓర్పుతో, నేర్పుతో నిష్పక్షపాతంగా వ్యవహరించి విజేతలను ఎంపిక చెయ్యడం జరిగింది. టాప్ 25లో నిలిచిన కవులకు, కవయిత్రులకు, ఉత్తమ కవి, ఉత్తమ కవయిత్రి గుర్తింపును అందజేయడం జరిగింది. వీరిలో ప్రథమస్థానంలో మందస మండలంలోని బిన్నళమదనాపురం గ్రామానికి చెందిన మార్పు జగన్మోహనరావు ఉత్తమ కవి అవార్డు అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కవితా 24 గంటల పోటీలో పాల్గొని టాప్ 25లో నిలిచిన విజేతలకు, పాల్గొన్న కవులు, కవయిత్రులందరికీ శ్రీ శ్రీ కళావేదిక టీం నుండి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక నుంచి ఉత్తమ కవి అవార్డు అందుకున్న మార్పు జగన్మోహనరావు పలువురు మేధావులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు, బిన్నళమదనాపురం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శిథిలావస్థలో జూనియర్ కాలేజీ భవనాలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు30 (వార్త):** ఎంతో ఘనచరిత్ర ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనే సుమారు నాలుగు దశాబ్దాలుగా జూనియర్ కళాశాల నడుస్తోంది. గతంలో హైస్కూల్‌లో జూనియర్ కళాశాల విలీనమై ఉండేది. ఆతర్వాత ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేశాక కాలేజీకి ప్రత్యేకంగా ప్రాంగణం కేటాయించారు. అంతవరకు కో ఎడ్యుకేషన్ విధానంలో నడిచేది. 1999లో బాలికలకు ప్రత్యేకంగా కళాశాల ఏర్పాటు చేయగా ఇటీవలే ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో నూతన ప్రాంగణంలోకి బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. కానీ ఎంతోచరిత్ర ఉన్న బాలుర కళాశాల పూర్తిగా శిథిలావస్థలోనే ఉంది. ఒకప్పటి సురంగి రాజులు ఈ ప్రాంతంలో నివాసం భవనాలను వారికి అనుకూలంగా నిర్మించుకున్నారు. అనంతరం సురంగిరాజ కోట పూర్తి కావడంతో ఈ భవనాలను ప్రభుత్వ పాఠశాల కింద జాతీయం చేశారు. రాజుల కాలం నాటి భవనాలలో ఇంటర్మీడియట్ సైన్స్ తరగతుల ల్యాబ్ నిర్వహణకు వినియోగించారు. జువాలజీ, ఫిజిక్స్ ,బోటనీ ల్యాబ్ నిర్వహణకి వినియోగించారు. కొన్నేళ్లపాటు హైస్కూల్ హెచ్ఎం కార్యాలయం కూడా ఈ కాంప్లెక్స్‌లోనే ఉండేది. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు -నేడు కింద రెండు కోట్ల రూపాయల వరకు కాలేజీ భవనాలకు నిధులు కేటాయించారు. అయినప్పటికీ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది. కళాశాలలో ప్రవేశాలు పెరిగాయి. విద్యాబోధన ఫలితాలు బాగుండడంతో అడ్మిషన్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఒరియా మీడియం కూడా ఉండడంతో ఎక్కువగా విద్యార్థులు చేరుతున్నారు. అటువంటి కళాశాలకు భవనాల కొరత వేధిస్తోంది. వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తే కళాశాలకు మరిన్ని సౌకర్యాలు అందుతాయి. ఇదే విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సహకారంతో నిర్మాణానికి అడుగులు వేసే దిశగా కళాశాల అధ్యాపక బృందం పూర్వ విద్యార్థులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

## కూలే దశలో బీసీ బాలుర వసతి గృహం




**జలుమూరు, ఆగస్టు 30 (వార్త):** మండల కేంద్రం జలుమూరులో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వెనుకబడిన కులాల బాలుర వసతి గృహం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శిథిలమైన భవనంలోనే వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం కొనసాగించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. వసతి గృహం భవనం బయట గోడలు బీటలు వారగా, పైభాగంలోని స్లాబ్ పలుచోట్ల బద్దలైంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు నేరుగా విద్యార్థులు చదువుకునే, విశ్రాంతి తీసుకునే గదుల్లోకి చేరుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారి చదువుకు ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు. భవనం చుట్టుపక్కల ఉన్న గచ్చులు, నేల భాగాలు కూడా పలుచోట్ల బద్దలవడంతో నడవడానికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. వసతి గృహంలో ప్రాథమిక సదుపాయాల పరిస్థితిని మెరుగుపరచాలని, ప్రమాదకరంగా మారిన భవనానికి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. జిల్లాలోని, మండలంలోని అనేక గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ వసతి పొందుతున్న విద్యార్థులు ఈ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడైనా స్లాబ్ మరింతగా దెబ్బతిని ప్రమాదం జరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవనాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన వసతి గృహ భవనంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు సురక్షితమైన వసతి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## తిలారు ఫ్లైఓవర్ వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

**జలుమూరు, ఆగస్టు 30(వార్త):** తిలారు ఫ్లైఓవర్ వంతెన వద్ద ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ లేదా విశ్రాంతి ప్రదేశం ఏర్పాటు చేయాలని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం అనంతరం బస్సులు వంతెన చివర భాగంలో నిలుస్తుండటంతో అక్కడ ప్రయాణికులు ఎండ, వానలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఫ్లైఓవర్ నిర్మాణం తర్వాత బస్సుల నిలుపుదల ప్రాంతంలో మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులకు కనీసం నిలువ నీడ కూడా లేకుండా పోయిందని పలువురు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బస్సుల కోసం నిరీక్షించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. చిన్నపాటి చినుకులు కురిసినా ప్రయాణికులు తలదాచుకునేందుకు ఎటువంటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని, అత్యవసరంగా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తిలారు నుంచి నరసన్నపేట, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ప్రయాణించే అనేక మంది ఈ బస్సు నిలుపుదల ప్రదేశాన్ని ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ ప్రయాణికుల రద్దీ ఉండే ప్రాంతంలో తాగునీటి సౌకర్యంతో పాటు బస్సు రాకపోకలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండేలా ఆధునిక బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యను పరిగణనలోకి తీసుకుని తక్షణమే ఫ్లైఓవర్ వంతెన సమీపంలో బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.





# ఇది రహదారే..
# నమ్మండి.. ప్లీజ్!

* దమ్ము పొలాన్ని తలపిస్తున్న రోడ్డు
* గోవింద పుట్టుగ-దూగానపుట్టుగ రహదారి దుస్థితి
* దశాబ్దాలు గడిచిన దశ మారని వైనం
* నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు
* అమలు కానీ నేతల హామీలు

**కవిటి, ఆగస్టు 30 (వార్త):** గ్రామీణ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేసామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నేతలకు అనేక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు దుస్థితి కనిపించడం లేదేమో. చెప్పిన సమస్యలన్నీ పరిష్కరించేస్తామని, అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో ఇప్పటికీ అమలు చేయకపోవడం అందరిని విస్మయానికి గురిచేస్తుంది. ఈ కోవలోనే కవిటి మండలం దూగానపుట్టుగ, గోవిందపుట్టుగ గ్రామాల మధ్య అత్యంత ప్రధానమైన రహదారి పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక గ్రామాల్లో సిమెంట్ రోడ్లతో పటిష్టమైన రహదారులు రూపొందించినప్పటికీ సహలాల పుట్టుక పంచాయతీ పరిధిలో గల ఈ రహదారిని పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఎన్నో దశాబ్దాలుగా ఇటువంటి ముఖ్యమైన రహదారిని పటిష్టంగా తీర్చిదిద్దమంటూ ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ ను ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నప్పటికీ ఈ సమస్య ఇప్పటికీ అపరిస్కృతంగానే మిగిలిపోయింది. దీని పట్ల అన్ని గ్రామాల ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ రెండు గ్రామాలకే కాకుండా చుట్టుపక్కల సుమారు 40 గ్రామాల ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారింది. అటు శిలాగాం రోడ్ నుంచి ఇటు గొనప పుట్టుగా జాడపూడి రోడ్డు నుంచి ప్రజల రాకపోకులకు ఎంతగానో వినియోగించే ఈ రహదారిని అభివృద్ధి పరచడంలో నేతలు ఎందుకో దృష్టి పెట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు ఇదే రహదారి అభివృద్ధి చేస్తామని అశోక్ హామీ ఇచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. రెండున్నర ఏళ్లు గడిచినప్పటికీ రహదారిని విస్మరించడం పట్ల ప్రతి ఒక్కరూ ఆవేదన చెందుతున్నారు. ఎన్నికలలో ప్రతిసారి తెలుగుదేశం పార్టీకి పట్టం కడుతున్న ఈ ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమైన ఇటువంటి రహదారిని అభివృద్ధి చేయకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న నేపథ్యంలో ఈ రహదారి దమ్ము మడి కన్నా అత్యంత దౌర్భాగ్యంగా మారింది. అడుగు తీసి అడుగు వేయడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. అదిగో ఇదిగో అంటూ నాయకులు మాటలతోనే కాలక్షాపం చేస్తున్నారంటూ పలువురు వాపోతున్నారు. శిలగాం రోడ్డు నుంచి గోవింద పుట్టుక వరకు తారు రోడ్డు నిర్మాణానికి సుమారు నాలుగు నెలల క్రితం కూటమి నాయకులు శంకుస్థాపన కూడా చేయడం గమనార్హం. వి బి జి రామ్ జి పథకం ప్రారంభం అవ్వగానే రోడ్డు నిర్మాణం జరుగుతుందని చెప్పినప్పటికీ అటువంటి పనులు ప్రారంభం కాకపోవడం అందరిని ఆగ్రహానికి గురిచేస్తుంది. ప్రస్తుతం ఈ రహదారిలో ద్విచక్ర వాహనంపై కనీసం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భారీ గోతుల మయమై బురద నీరు నిండి రోడ్డు చిన్నపాటి చెరువులను తలపిస్తోంది. ఇటువంటి సమస్య పట్ల ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఊక లారీలతో జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు

**సారవకోట, ఆగస్టు 30 (వార్త):** సారవకోట మండలంలోని అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల జంక్షన్‌లో నిత్యం ఊక లారీల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ మూడు గ్రామాల పరిధిలో ఉన్న రైస్ మిల్లుల నుంచి ఊకను ఇతర ప్రాంతాలకు తరలించే భారీ లారీలు జంక్షన్ మీదుగా పగటి వేళల్లోనే తరచూ రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంక్షన్ వద్ద రహదారి ఇరుకుగా ఉండటంతో ఒకేసారి భారీ లారీలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోంది. ముఖ్యంగా లారీలు జంక్షన్ వద్ద మలుపులు తిరిగే సమయంలో కొంతసేపు ఇతర వాహనాలు నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పలు సందర్భాల్లో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పగటి సమయంలో ప్రజల రాకపోకలు అధికంగా ఉండే వేళల్లో భారీ లారీల రాకపోకలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. ఊక లారీలకు నిర్దిష్ట సమయాలను కేటాయించడం లేదా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. జంక్షన్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యల ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546